# జిఎస్‌టి అమలు వివిధ సెక్షన్ల ప్రజలపై పెరిగిన భారాలు

**దేశం** మొత్తంలో ఏకీకృత పన్ను విధానాన్ని ఏర్పరచే ప్రకటిత లక్ష్యంతో వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి)ని 2017 జులై 1న ప్రవేశపెట్టారు. ప్రకటించినదానికి భిన్నంగా దేశంలో – సిజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి, ఐజిఎస్‌టి – వంటి అనేక దొంతరల బహుళ పన్నులు ఉనికిలోకి వచ్చాయి. 'ఒకే దేశం – ఒకే పన్ను' అనే ఆకట్టుకునే నినాదం గాలికి కొట్టుకుపోగా, సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా వాణిజ్యవర్గాల పాలిట ఈ పన్ను మరణ శాసనంగా మారింది.

మొదటి అంశం – జిఎస్‌టి ప్రకారం విధించిన పరిమితి. 20 లక్షల రూ॥ సాంవత్సరిక టర్నోవర్‌కు లోబడిన వ్యాపారులను వస్తు, సేవల పన్ను చెల్లింపుదారుల నుండి మినహాయించారు. ఈ నిబంధన తయారీ రంగానికి వెన్నెముకగా వున్న లక్షలాది చిన్న పరిశ్రమలను ఘోరంగా దెబ్బతీసింది. ఈ చిన్న పరిశ్రమల సాంవత్సరిక టర్నోవరు 1 కోటీ 50 లక్షల రూ॥కు లోబడివుంటే, ఎక్సైజు పన్ను చెల్లింపు నుండి వారికి మినహాయింపు లభించేది. అయితే చిన్నవా, పెద్దవా అనేదానిమీద కాక, ఆ పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకులపై ఆధారపడి జిఎస్‌టి విధింపు వుంది కనుక, ఇప్పుడు దాదాపు ఆర్థికమంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం, ఇప్పటిదాకా పరోక్ష పన్నుల ద్వారా వచ్చే 90 శాతం ఆదాయం, 1 కోటీ 50 లక్షల రూ॥ పైగా సాంవత్సరిక టర్నోవర్ వున్న వ్యాపారుల నుండి లభించేది. జిఎస్‌టి అమలుతో చిన్న పరిశ్రమలు, వ్యాపారవర్గాలపై పన్ను భారం పడింది. ఇదేదో యథాలాపంగా జరిగింది కాదు; ఉద్దేశ్యపూరితంగా జరిగిందే.

రెండో అంశం – చిన్న పరిశ్రమలకు పరిమితిలోపు టర్నోవరు వున్నవారికి పన్ను మినహాయింపు అంటే అర్థం, వారిపై పన్నుల భారాలేమీ ఉండబోవని కాదు. నమోదు చేయించుకోవటానికి మాత్రమే ఈ మినహాయింపు. 'రివర్స్‌ఛార్జ్' అనబడే చుట్టు తిరుగుడు పద్ధతిలో వీరిపై పన్నుల భారం వుంటుంది. జిఎస్‌టిలో నమోదు చేసుకున్న ఒక వ్యాపారికి, జిఎస్‌టిలో నమోదు చేసుకోని ఓ సరఫరాదారుడు తన సరుకులను అమ్మితే, కొనుగోలు చేసిన వ్యాపారి దానిపై జిఎస్‌టి చెల్లించి, ఆనక, వడ్డీతోసహా ఆ పన్ను మొత్తాన్ని తిరిగి చెల్లించాలని క్లెయిమ్ చేసుకోవాలి. చిన్న పరిశ్రమలను జిఎస్‌టి నుండి విముక్తం చేసినట్లుగా కన్పడుతుంది. కానీ వాస్తవానికి మరోవిధంగా ఇది వర్తింపజేశారు. జిఎస్‌టిలో నమోదుకాని చిన్న వ్యాపారులతో ఏదేనీ మధ్యతరహా వాణిజ్యసంస్థ లావాదేవీలు జరపాలంటే, ఆ చిన్న వ్యాపారులు కూడా జిఎస్‌టిలో నమోదు చేసుకొని వుండాలి. లేకుంటే వారి సరుకులు, సేవలు పొందటానికి ఆ మధ్యతరహా సంస్థ నిరాకరిస్తుంది. అధికార్లకు నిర్ణీత స్వల్పకాల వ్యవధిలో ఆదాయ – వ్యయ వివరాలు సమర్పించాల్సి వుండటం, మొదట పన్ను చెల్లించి ఆపై దానిని తిరిగి రాబట్టుకునేందుకు క్లెయిమ్ చేసుకోవాల్సి వుండటం, ఈ క్రమంలో అధికారులు ఎప్పుడైనా ఈ లావాదేవీల వివరాల సక్రమత్వం గురించి ప్రశ్నించే అవకాశముండటం – వంటి అంశాలతో చిన్న, మధ్యతరహా వ్యాపారులకు జిఎస్‌టి చాలా ప్రతిబంధకంగా తయారైంది. మినహాయింపు పరిమితికి లోబడి తమ టర్నోవరు వుందని అధికారులు నమ్మేట్లు చేసేందుకు అనేక ప్రక్రియలతో చిన్న వ్యాపారులు చాలా శ్రమ పడవలసి వుంటుంది. ఈ విధానం – పరిశ్రమలు రోజువారీ నడవడానికి అవసరమయ్యే పెట్టుబడిని నెలల కాలంపాటు నిరోధిస్తుంది. జిఎస్‌టిలో నమోదుకాని సరఫరాదారుడి నుండి జిఎస్‌టి ప్రకారం–నమోదైన డీలరు రోజుకు 5 వేల రూ॥ విలువగల వస్తువులను మాత్రమే కొనుగోలు చేయటానికి ప్రభుత్వం అనుమతిస్తోంది. ఇది చాలా స్వల్పమొత్తం కాగా, అత్యధిక వస్తువులను రోజువారీ విధానంపై ఆధారపడి సమకూర్చుకోవటం సాధ్యంకాదు. ఇదికాక, 'రివర్స్ ఛార్జి' అనబడే మరో ఇబ్బంది ఉండనే వుంది.

పైన పేర్కొన్న ఈ రెండు అంశాలూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపార విభాగాలను వాస్తవికంగా ఎలా దెబ్బతీశాయో చూద్దాం.

**చేతివృత్తిదార్లు**

ఇప్పటివరకూ చూసిన వాటిలో జిఎస్‌టి ఒక్కటే మనదేశంలోని అత్యంత ప్రగతిశీలమైన పన్ను సంస్కరణగా గొప్పగా ప్రచారం చేశారు. అయితే 3 నెలల కాలపు దాని అమలులో, అది చేతివృత్తిదార్ల – వారు ఆంధ్రప్రదేశ్‌లో తోలుబొమ్మలు చేసేవారుకావచ్చు; ఉత్తరప్రదేశ్‌లోని చెక్కపూసల తయారీదారులు కావచ్చు; సూరత్‌లో వస్త్రాలపై అద్దకం వేసేవారు కావచ్చు – వీరందరి జీవనాధారాలను కబళించే దిశగా భయం కొల్పుతోంది. జిఎస్‌టితో–పన్ను రూపంలో భారంతో పాటు ప్రభుత్వానికి నివేదించాల్సిన పత్రాలను ఎప్పటి కప్పుడు సిద్ధం చేయాల్సిన పనిభారాలతో ఈ చేతివృత్తుల విభాగాలను వ్యాపారపరంగా గిట్టుబాటుకాని విధంగా త్వరలో మార్చివేయనున్నారు.

అత్యధిక చేతివృత్తిదార్లు చదువురానివారేగాక, వారి కుటుంబ సాంప్రదాయానికి అనుగుణంగా ఆయా చేతివృత్తులలో నైపుణ్యం పొందినవారుగా వున్నారు. స్థానికంగా వీరు తమ వస్తువులను అమ్ముకోగలిగేది చాలా తక్కువగా వుంటుంది. హస్తకళా వస్తు ప్రదర్శన శాలలకు, చాలా దూరంగా వున్న నగరాలకు వీరు తమ వస్తువులను సరఫరా చేయవలసి వుంటుంది. 'దస్తకారి హాత్ సమితి' నిర్వహించిన ఒక సర్వే ప్రకారం, 82 శాతం వస్తువుల అమ్మకాలపై సంవత్సర ఆదాయం 20 లక్షల రూ॥లోపే వుండగా, 75 శాతం చేతివృత్తి దారులకు తమ వృత్తికి పన్ను వర్తిస్తుందనే విషయమే తెలీదు. కాగా 89 శాతానికి తాము చెల్లించిన పన్ను తిరిగి ప్రభుత్వం చెల్లింపుద్వారా తమకు అందుతుందనే అంశమే తెలియదు. వీరంతా తాము ప్రభుత్వానికి సమర్పించాల్సిన వివిధ పత్రాలు

రూపొందించేందుకు అవసరమైన ఓ అకౌంటెంట్‌ను ఏర్పరచుకొని, అతనికి జీతం చెల్లించగలిగే స్థితిలో లేరు. గతంలో పన్నులేని ఈ విభాగం జిఎస్‌టి ప్రకారం 18 శాతం పన్ను కట్టాల్సిన శ్లాబు పరిధిలోకి వచ్చింది.

చేతివృత్తిదార్లకు ఇచ్చిన పన్ను మినహాయింపు రెండువిధాలా ఏమాత్రం ప్రభావం చూపేదిగా లేదు. చేతివృత్తుల ద్వారా తయారుచేసిన వస్తువుల కొనుగోలుదార్లు ప్రభుత్వానికి సమర్పించాల్సిన పత్రాల తాలూకూ అదనపు పనిని స్వీకరించటానికి సిద్ధంగా లేరు; లేదా చేతివృత్తిదార్ల తరపున తామే జిఎస్‌టి చెల్లింపుకూ సిద్ధంగా లేరు. జిఎస్‌టిలో నమోదైన నెంబర్‌ను రాయకపోతే, చేతివృత్తిదార్ల వస్తువులను నగరంలోని దుకాణాలకు చేరవేయటానికి కొరియర్ సంస్థలు కూడా నిరాకరిస్తున్నాయి. ఈ చేతివృత్తిదార్లు పండుగల సమయంలో చాలా దూరంలోనున్న నగరాలలో, పట్టణాలలో తమ వస్తువులను అమ్ముకుంటూ వుండేవాళ్ళు. కాగా, ఇప్పుడు రాష్ట్రం దాటి మరో రాష్ట్రంలో (అంతర్రాష్ట్ర) వస్తువులను అమ్ముకునేట్లయితే, తమ సాంవత్సరిక టర్నోవరు మినహాయింపు పరిమితికి లోబడి వున్నప్పటికీ, 16 శాతం జిఎస్‌టి చెల్లించాల్సి వుంటుంది.

చేతివృత్తులపై విధించిన హేతువిరుద్ధమైన ఈ పన్ను చేతివృత్తులను శిక్షకు గురిచేస్తోంది. ఈ విభాగంలో ఇప్పటికే దాదాపు 20 శాతం అమ్మకాలు తగ్గిపోయాయి. పశ్చిమబెంగాల్, ఒడిషా, ఝార్ఖండ్ రాష్ట్రాల ఆదివాసులు నాలుగువేల సంవత్సరాలుగా మైనాన్ని మలిచే సాంకేతికతననుసరించి చేస్తోన్న ధోక్రా మెటల్‌వర్క్ వస్తువులను జిఎస్‌టిలో 12 శాతం పన్ను శ్లాబు పరిధిలోకి తీసుకొచ్చారు. వస్త్ర వ్యర్థాలను ఉపయోగించి చేతితో తయారుచేసిన గుడ్డ సంచులపై గతంలో పన్ను లేదు. ప్రస్తుతం ఈ సంచులు 18 శాతం పన్ను విభాగంలో వున్నాయి. వృధా పదార్థాలను ఉపయోగించి తయారుచేసే సంచులు గనుక, ఉత్పాదక పన్ను ఏవిధంగా చెల్లించాలో వారికి తెలీదు. హేతు విరుద్ధతకు ఎల్లలు లేకుండా వుంది. మట్టి కుండలు, పాత్రలు, దీపాలపై పన్నులేదు. కానీ గ్రామీణ ప్రాంతంలో ఇళ్ళ నిర్మాణానికి వుపయోగించే టెర్రాకొట్టా పెంకులపై 5 శాతం పన్ను విధించారు. టేబుల్‌వేర్, గంటలు, బొమ్మలు వంటి టెర్రాకొట్టా తయారుచేసిన వస్తువులను 18 శాతం పన్ను పరిధిలోకి తేగా, టెర్రాకొట్టా రూపొందించే మతపరమైన దేవతా విగ్రహాలపై పన్నును తొలగిస్తూ తాజాగా మినహాయింపునిచ్చారు.

జిఎస్‌టి విధింపు – పైకి కనపడుతున్నదానికంటే విస్తృతంగా తన వలను విసురుతూ వుంది. సెప్టెంబర్‌లో ప్రకటించిన కొన్ని మినహాయింపులు కేవలం కంటితుడుపు మాత్రమే. 12 శాతం పన్ను శ్లాబు పరిధిలోనున్న మరికొన్నిటిని చూడండి. వెదురు తడికలు, బుట్టలు, ఇతర వస్తువులను రోడ్లప్రక్క తయారుచేసి అమ్ముతూ వుంటారు. రాళ్ళు, పూసలనుపయోగించి తయారుచేసే గృహాలంకరణ వస్తువులు, మధువని, వర్లి, గోండ్, సంఝు మరియు ఇతర జానపద కళలు 18 శాతం పన్ను శ్లాబు పరిధిలో వున్నాయి. ఊదారంగు అద్దకాలు, పండుగలు, జాతరలు ఇతర ఉల్లాసపరిచే సందర్భాలలో వాడే వస్తువులు, గారడీ పరికరాలు మొదలైనవాటినన్నీ జిఎస్‌టి పరిధిలోకి తెచ్చారు.

దేశవ్యాపితంగా చేతివృత్తిదారుల కార్యకలాపాలు కదలికలు లేని స్థితికి చేరుకున్నాయి. తిండికి కరవై అలమటించే దుర్భర పరిస్థితులను వారు ఎదుర్కొంటున్నారు.

**చేనేత కార్మికులు**

చేనేత కార్మికులను వెంటాడే కష్టాలకు అంతులేదు. దీనికిప్పుడు నూతనంగా జిఎస్‌టి తోడైంది. చేతిమగ్గంపై నేత నేయటం ఇప్పటికే కృశించిపోయే దిశలో వుంది. 2009–10 కాలపు చేనేత జనాభా లెక్కల ప్రకారం దాదాపు 43 లక్షల మంది ఈ విభాగంలో పనిచేస్తున్నారు. 1995–96నాటి గత జనాభా లెక్కల ప్రకారం 65 లక్షలమందిగానున్న వీరు ఎంతగా తగ్గిపోయారో తెలుస్తోంది.

'స్వదేశీ', 'భారతీయ సంస్కృతి'తో దేశాన్ని పాలిస్తామని ప్రమాణంచేసి అధికారంలోకి వచ్చిన బిజెపి – ఆర్ఎస్ఎస్‌లు, రైతాంగం తర్వాత అత్యధికంగా బలవన్మరణాలకు పాల్పడుతున్న చేనేత కార్మికులను ఆదుకోకపోగా, వారిపాలిట మృత్యుఘంట మోగిస్తున్నాయి.

జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ అధ్యయనం ప్రకారం, యువతలో నైపుణ్యాలను అభివృద్ధిచేయాలంటూ మోడీ చేపట్టిన కార్యక్రమం నెట్ సౌకర్యంలేని, తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలతో నుండే గ్రామాలలో నివసించే 84 శాతంవారికి అందే అవకాశం లేదు. వీరిలో 70 శాతం మంది నిరక్షరాస్యులుగా వుండటంతోపాటు పరిమిత ఆదాయాలుగల కులాలు, వర్గాలు, మత మైనారిటీలుగా వున్నారు.

జిఎస్‌టి చట్టం – చేనేత వస్త్రాలకి, మిల్లు వస్త్రాలకి నడుమ తేడాను చూపలేదు. రెండు వస్త్ర రకాలపై ఒకే విధమైన పన్ను విధించారు. పూర్తిస్థాయిలో ఆధునీకరించబడిన బట్టల మిల్లులతో చేనేత కార్మికుడిని పోటీపడమని చెబుతున్నారన్నమాట! ఈ పన్ను విధానం అమలు తర్వాత కాలంలో చేనేత అమ్మకాలు 15 నుండి 20 శాతం పడిపోవటాన్ని మనం చూడవచ్చు.

నెలలో మూడుసార్లు వివరాలతో కూడిన పత్రాలను ప్రభుత్వానికి సమర్పించాలని జిఎస్‌టి చట్టం, చేనేత కార్మికులను ఆదేశిస్తోంది. ఫలితమేమిటి? జైపూర్‌లోని కలేదరలో అద్దకం వృత్తిచేసే కృష్ణకుమార్ చెప్పినదాని ప్రకారం, అద్దకం పనిలోని చాలామంది కార్మికులు తమ గృహ పరిశ్రమను మూసివేసి ఎక్కడైనా పనికి వెళుతున్నారు. తమ జిఎస్‌టి భారాన్ని కమీషన్ లబ్ది పొందే ప్రాతిపదికన కొనుగోలు చేయటానికి వ్యాపారు లెవరైనా ముందుకొస్తే, గతకంటే తక్కువ ధరలకే వారికి వస్తువులను అమ్ముతున్నారు.

చేనేత జనాభా లెక్కలు తెలియజేస్తున్న విధంగా అనేకమంది చేనేత కార్మికులు ఇప్పటికే తమ సాంప్రదాయ వృత్తిని వదలివెళ్తున్నారు. జిఎస్‌టి చట్టం అమలుతో ఇది మరింత తీవ్రరూపం దాల్చి, చాలా పరిమితంగా అందుబాటులోనున్న ప్రత్యామ్నాయాలను వెదుక్కొంటూ వెళ్ళిపోయేందుకు నెట్టబడతారు. జిఎస్‌టి చేనేత కార్మికుల పాలిట మృత్యుపాశాన్ని విసురుతోంది.

**చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు**

రెడీమేడ్ దుస్తుల పరిశ్రమను తీసుకుంటే, దేశంలోనే అధిక విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించే పరిశ్రమలలో ఒకటిగా వుంది. పెద్దనోట్ల రద్దుతో ఇబ్బందులనెదుర్కొంటుండగానే, జిఎస్‌టి అమలుతో ఈ విభాగంలోని పెద్ద పరిశ్రమలు పరివర్తనా సమస్యలతో సతమతమౌతున్నాయి. ప్రారంభదశలో వారు ఎక్కువ పన్ను చెల్లించవలసిరావటంతో, పరిశ్రమ నడవటానికి కావలసిన పెట్టుబడి అవసరాలు పెరిగాయి. దుస్తుల ఎగుమతి జరిగిన తర్వాత వీరు చెల్లించిన ఉత్పాదక పన్ను తిరిగి చెల్లించబడుతుంది.

హర్యానాలోని ఓ పరిశ్రమ మేనేజర్ మాట్లాడుతూ భారీ స్థాయిలోని తమ ఉత్పత్తి మందగించిందని, మే నెలలో 600 మందిగానున్న ఉద్యోగుల సంఖ్య సెప్టెంబర్ నాటికి 390కి తగ్గిపోయిందన్నాడు. ఉత్పత్తి విభాగంలోని 45 యంత్రాలను 36కు తగ్గించారు. ఒక్క ఏప్రిల్ నెలలోనే 60 వేల దుస్తులను తయారుచేయగా, ఆ సంఖ్య సెప్టెంబర్‌లో 40 వేలకు పడిపోయింది.

జిఎస్‌టి చట్టానికనుగుణంగా పెద్ద పరిశ్రమలు సంసిద్ధమౌతుండగా పెద్ద పరిశ్రమలకు అమ్మకందార్లుగా వున్న చిన్న పరిశ్రమలు చాలా అనిశ్చిత పరిస్థితుల నెదుర్కొంటున్నాయి. రెడీమేడ్ దుస్తులకు లేసులు కుట్టడం, ఎంబ్రాయిడరీ చేయటం, పూసలు వేయటం వంటి పనులను చిన్న పరిశ్రమలకు ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వటం ద్వారా పెద్ద పరిశ్రమలు ఉత్పత్తి సాగిస్తున్నాయి. 50మంది కార్మికులతోనున్న మధ్యతరహా పరిశ్రమ 'ఏ' - జిసిటి చట్టప్రకారం ప్రభుత్వానికి సమర్పించాల్సిన పత్రాలన్నింటితో సిద్ధంకాగలదు. 15 మంది కార్మికులతోనున్న చిన్న పరిశ్రమ 'బి' - తనకొచ్చే కొద్దిపాటి లాభం తుడిచిపెట్టుకుపోగా మనుగడ కష్టమవుతోంది. ప్రస్తుతం పరిశ్రమ-'బి' తన కాంట్రాక్టులన్నింటినీ కమీషన్ ఇచ్చే ప్రాతిపదికన పరిశ్రమ-'ఏ' ద్వారా చేయించుకుంటూ తన పరిశ్రమలో పనిచేసే 15 మందిలో నలుగురిని తొలగించింది.

ఇంతేగాక, రెడీమేడ్ దుస్తుల పరిశ్రమ యజమాని - నూలుపై విధించిన 18 శాతం ఉత్పాదక పన్నును, ఈ నూలుతో తయారుచేసిన వస్త్రంపై 5 శాతం పన్నును కూడా చెల్లించాల్సిరావటంతో దుస్తుల ధర అనివార్యంగా పెరిగిపోతోంది. అయితే విదేశీ కొనుగోలుదారునితో ముందుగానే దుస్తుల నిర్ణయం జరిగి, ఒప్పందం చేసుకొని వుండటంతో, ఈ పెరిగిన ధరను కొనుగోలు దారుడైన విదేశీ కంపెనీపై మోపటం సాధ్యంకాదు.

ఇదేవిధంగా 'భివాండి పవర్‌లూమ్ వీవర్స్ ఫెడరేషన్' వివరాల ప్రకారం ఒక్క భివాండీలోని పవర్‌లూమ్ విభాగంలోనే 2 లక్షలమంది కార్మికులు పనులు కోల్పోయారు.

భారత తోలు పరిశ్రమను తీసుకుంటే, దేశంలో తయారైన చెప్పులు నాణ్యతను, మన్నికకు పేరెన్నికగన్నవి. గతంలోకంటే చాలా ఎక్కువగా చెప్పుల పరిశ్రమలో ఉపయోగించే ముడిపదార్థాలపై 18 నుండి 28 శాతం జిఎస్‌టి విధించారు. చిన్న స్థాయిలోని చెప్పుల తయారీ యూనిట్లను ఎక్సైజు పన్ను నుండి మినహాయించటంతో, పెద్ద కంపెనీలన్నీ తమ చెప్పుల తయారీని ఔట్‌సోర్సింగుకు ఇచ్చి, చిన్న యూనిట్ల ద్వారా తయారు చేయించుకుంటున్నాయి. జిఎస్‌టిలో నమోదైనవారికి మాత్రమే పెద్ద కంపెనీలు ఇప్పుడు ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వవలసి వుంటుంది.

పెద్ద కంపెనీలకు సరఫరాలు చేసే చిన్న కంపెనీలు అనిశ్చిత స్థితినెదుర్కొంటున్నాయి. చెప్పులు, బూట్ల తయారీలో వాడే ముడిపదార్థాలు, విడిభాగాలైన 'సోల్స్' 'అప్పర్స్' ధర 150 రూ॥ నుండి 183కు పెరగటంతో పాటుగా జిఎస్‌టి చెల్లించాల్సి వస్తోంది. తోళ్ళు, చెప్పుల పరిశ్రమ కేంద్రంగా వున్న ఆగ్రాలో చెప్పులు, చేతి సంచులు తయారుచేసే 7 వేల కుటీర పరిశ్రమలలో 2 లక్షలమంది పనిచేస్తున్నారు. ఓ కుటుంబం నివసించే ఇల్లు పగలు కుటీర పరిశ్రమగా, సాయంత్రం వంటగదిగా, రాత్రికి పడకగదిగా మారిపోతుంది. వారి ఆదాయాలు అతి స్వల్పంగా వుంటాయి. జిఎస్‌టి విధి విధానాలకు వారు సరితూగగలగటమనేది ఊహించలేనిది. పెద్ద కంపెనీల నుండి వచ్చే పనులు ప్రస్తుతం 30 శాతం తగ్గిపోయాయి. ఇతర వృత్తిని దేనినైనా ఎంచుకోవటమో లేదా చాలీచాలని ఆదాయాలతో ఇలాగే కృశించిపోవటమో తేల్చుకోవాల్సిన స్థితిలో వారున్నారు.

పిండిమిల్లుల పరిస్థితిజూస్తే, గోధుమపిండి, శనగపిండి, మైదా, గోధుమరవ్వ, ఇడ్లీరవ్వ, మరియు ఇతర ఉత్పత్తులతో స్థానిక పరిసరాల్లోని వినియోగదారులకు అందుబాటులో వుండే 1400 పిండిమిల్లులున్నాయి. ఇవి ఎక్కువ పరిమాణంలో ప్యాకెట్లను విక్రయించలేవు. టాటా, ఐటిసి, యూనిలివర్ వంటి బడా కంపెనీలకంటే కొద్దిగ తక్కువ ధరకు, స్థానిక ప్రజానీకపు కొనుగోలు శక్తికనుగుణంగా ఒక కిలో, అరకిలో ప్యాకెట్స్‌ను విక్రయిస్తాయి. ఇప్పుడు వారు తప్పనిసరిగా వారి 'బ్రాండ్' పేరుతో విక్రయించాలి. అందుకుగాను అనివార్యంగా 5 శాతం జిఎస్‌టిని చెల్లించాలి. దీనితో చిన్న, మధ్యతరహా పిండిమిల్లులు తయారుచేసిన పిండి, రవ్వ ప్యాకెట్ ధరలు-పెద్దకంపెనీలు తయారుచేసిన పిండి, రవ్వ ధరలతో పోలిస్తే హెచ్చుగా వుంటాయి. కొద్దికాలం తర్వాత, బ్రాండ్‌లపై చర్యకు యోగ్యమైన క్లెయిమ్‌లతో ముందుకు వెళితే, వారు పన్ను విధింపు నుండి మినహాయించబడతారని ప్రభుత్వం ప్రకటించింది. ఇది మరింత సంక్లిష్ట సమస్యలకు దారి తీస్తుంది. తమకు చెడ్డపేరు తీసుకువచ్చేందుకు అసలైన బ్రాండ్ లాగానే పైపై మెరుగులతో తక్కువ నాణ్యత కలిగిన పిండిని విక్రయిస్తే బ్రాండ్ అస్తిత్వం సమస్యను అదేవిధంగా నకిలీ బ్రాండ్ల సమస్యను ఎదుర్కోవలసి వస్తుంది.

పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టిలు ఆర్థికవ్యవస్థను - ప్రత్యేకించి చిన్న పరిశ్రమలను ఘోరంగా దెబ్బతీశాయి. 5 వరుస త్రైమాసిక గణాంకాలు చూస్తే దేశ వ్యాపితంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల విక్రయాలు క్షీణించటంతో పాటు, ఉద్యోగ కల్పన దిగజారుతూ వస్తోంది. ఖచ్చితంగా ఈ విభాగమే కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిపోయి కాబోయే ప్రధాని మోడీ అంటూ ఆశలు పెట్టుకొని ప్రచారం చేసి 2014లో మోడీని అధికారంలోకి తీసుకురావటంలో ముఖ్యభూమిక పోషించింది. ఈ విభాగమే ప్రస్తుతం విషాదంలో కూరుకపోయి వుంది.

పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టిల అమలు సందర్భంగా – స్వల్పకాలిక బాధలకోర్చితేనే, దీర్ఘకాలిక ఫలాలనందుకో గలమని మోడీ పేర్కొన్నాడు. బాధను భరించి బ్రతికితేనే ఫలితాలను అనుభవించగలిగేది. జిఎస్‌టికి ముందు కాలంలో రాష్ట్రాలు విధించే 29 వ్యాట్‌లు (వాల్యూయాడెడ్ ట్యాక్స్), ఒక కేంద్ర ప్రభుత్వ వ్యాట్, కేంద్ర ఎక్సైజు పన్ను, కస్టమ్స్ పన్ను – మొత్తంగా 32 రకాల పన్నులు వుండేవి. జిఎస్‌టి తర్వాత 29 ఎస్‌జిఎస్‌టిలు, ఒక సిజిఎస్‌టి, కేంద్ర ఎక్సైజు పన్ను, కేంద్ర కస్టమ్స్ పన్ను – మొత్తంగా 31 రకాల పన్నులయ్యాయి. ఇక దేశ వ్యాపితంగా ఒకే పన్ను విధానం ఎక్కడ? అంటే గతంకంటే ఒక పన్ను తొలగించబడిందన్నమాట! కేంద్ర ప్రభుత్వ 'వ్యాట్' జిఎస్‌టితో కలిసిపోయింది.

జిఎస్‌టితో ఎదురయ్యే సమస్యలు, కష్టాలు తాత్కాలికమైనవో లేక పరివర్తనాదశకు పరిమితమైనవో కాదు. ఇవి దీర్ఘకాలం కొనసాగుతాయి. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమర్పించాల్సిన అలవిమాలిన పత్రాల పనికి తోడు భరించలేని పన్నుల భారాలు చిన్న, మధ్యతరహా పరిశ్రమల మూసివేతకో లేదా పన్ను చెల్లింపు ఎగవేతకో నెడతాయి. ఈ స్థితి అవినీతిని పెంచి పోషించటమేగాక, ఈ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నిరంతర వేధింపులనెదుర్కోవలసి వస్తుంది.

ప్రభుత్వం జిఎస్‌టితో మోపిన భారాలపట్ల విస్తృత అసంతృప్తి వ్యక్తమైంది. అయినా నిర్దిష్టమైన మార్పులేమీ జరగలేదు. కొన్ని వస్తువులను ఒక శ్లాబ్ పరిధిలో నుండి మరో శ్లాబు పరిధిలోకి మార్చటమే జరిగింది మినహా, శ్లాబుల సంఖ్య అలాగే వుంది. చిన్న వ్యాపారులను, పరిశ్రమదారులను పన్ను ఎగవేతదారులుగా ప్రచారం గావిస్తూ ఆర్థికవ్యవస్థలో వారందరినీ అనియత విభాగం నుండి నియత విభాగానికి తెచ్చి, వారిపై పన్నుల భారాన్ని పెంచటమే జిఎస్‌టి ప్రధాన లక్ష్యంగా వుంది.

ఆర్థికమంత్రిత్వశాఖలోని తన ముందున్నవారివలెనే పెట్రోలు, డీజిల్‌లపై రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులలో కోత విధించకుండా వాటిని జిఎస్‌టికి బయటనే వుంచిన ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సలహాలో ఆదాయాలను ఏ రూపంలోనూ ప్రజల నుండి వదులుకోరాదనే ప్రభుత్వ స్వభావాన్ని చూడవచ్చు. గత సంవత్సరకాలంలో పెట్రోలు, డీజిల్‌ల ద్వారా ఆదాయం 90 వేల కోట్ల రూ॥ నుండి 3 లక్షల 40 వేల కోట్ల రూ॥కు చేరుకుంది. కొన్ని ప్రజావిభాగాలు డిమాండ్ చేసినవిధంగా పెట్రోల్, డీజిల్‌లను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలన్న సందర్భంలో కూడా స్వల్పకాలం మాత్రమే వినియోగదారులు ప్రయోజనం పొందగలుగుతారు. వెనువెంటనే ప్రభుత్వం 2 లక్షల కోట్ల రూ॥ ఆదాయాన్ని నష్టపోనుండటంతో 28 శాతం జిఎస్‌టి, మరియు 15 శాతం స్థానిక పన్ను కలిపి మొత్తం గరిష్టంగా 43 శాతం పన్ను విధించవచ్చు. కొనుగోలు విలువ ప్రాతిపదికను దిగుమతి సుంకంతో కలిసిన ముడిపెట్రోలియం మౌలిక ధర ఆధారంగా, ఏ సమయంలోనైనా ప్రభుత్వం ఈ పన్ను పెంచవచ్చు లేదా అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల పెరుగుదలకు అనుగుణంగా ఆటోమేటిక్‌గా పెరగవచ్చు. కొద్దికాలంలోనే పెట్రోలు, డీజిల్ ధరలు గతంలో స్థాయికి చేరుకుంటాయి.

అనియతరంగం నుండి నియతరంగంలోకి తీసుకువచ్చే ప్రక్రియ ఇక్కడితో ఆగబోవటంలేదు. చాలా చర్యలు జరగబోతున్నాయి.

మోటర్ వాహనంపై 10 కిలోమీటర్ల దూరం మించి 50 వేల రూ॥ పైగా విలువైన వస్తువులను తరలించేట్లయితే అందుకు సంబంధించిన జిఎస్‌టి సంబంధిత సమాచారాన్నంతా ప్రతి వ్యాపారీ సంసిద్ధం చేసుకోవటంతోపాటు తప్పనిసరిగా 'ఈ–వే బిల్లు'ను కలిగి వుండాలనే మరో భారం చిన్న, మధ్యతరహా వ్యాపారులపై వచ్చే నెల నుండి మోపనున్నారు. ఒకే జాతీయ మార్కెట్‌గా చెప్పబడుతున్న దానిలో తమ సరుకులను స్వేచ్ఛగా తరలించలేని స్థితిలో చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలు గందరగోళానికి గురవుతాయి.

oooo